నూలుపోగు

ఎన్నార్ 'భోలా'

పెద్ద ఊరెల్పుగడి- గడీల నట్టనడుమ ఒక చిన్నయిల్లు- ఆ యింటిముంగట చెర్వేల్పువాకిలి. కుడిదిక్కు రొండు పాయకాన దొడ్లు- గండ్ల అమ్మగారోల్లె బోతరు- ఇంకోలుబోవద్దు- ఆ దొడ్లకు ఈవలికని బాయి- బాయిపక్కపొంటి పెద్దచింతచెట్టు ఆ చింతచెట్టు కిందినుంచి ఇంటెన్క పెరట్లకుతొవ్వ- పెరట్ల మక్క జొన్నయేసిండ్లు- అండ్ల ఒక పాంపుట్ట- పుట్టమీన తీగెచెట్లు, కట్లపూలుగూడ వున్నయి. అక్కన్నుంచి ఎడుమపక్క కత్తె అక్కడ రొండు కుమ్మరిగోలాలు భూమిలపాతివున్నయ్- అవ్వి రోజు వాకిలిసల్లటానికి అలుకుకలిపె గోలాలు- పక్కన్నె అంపలి[1] మూతులుబెయిన కుండల్ల నీల్లువున్నయి- తలెలు చెంబులు గక్కన్నెకడుగుతరు ఆనీల్లు పెరట్లకు పోతయి. అంపలిపక్కపొంటి ఉప్పలమ్మగుడి- గుడంటె నాల్గురాళ్లతోని ఇటోటి అటోటి ఎన్కోటి మీదోటి పొయ్యిమాదిరి పెట్టింది. అండ్ల పసుపు కుంకుమసల్లి దీపంముట్టిచ్చి మొక్కుతరు. ఆ ఉప్పలమ్మగుడిపొంట చిన్నమొండిగోడ- మొండి గోడకు వాసూరేసిన సూనెపిపాలరేకులు- ఆ రేకులకింద రొండు జంపుకాన్ల మొగ్గాలు.

పెద్దఎండల పెయిమీద అంగిలేకుంట పంచెబుడ్డజెక్కిన ఒకాయన చింతకింది మొకాన, గంజిలతడిపిన సరిజాపె వంకెన్లెక్కిచ్చి ఊడ్తికిబెట్టి, ఊడ్తికున్న పాతిన కొయ్యకునడుమ దుప్పికొమ్ముగట్టి తాడుబిగిస్తుండు. నడుమ నడుమ సరిమీద లాకబద్ద[2] కొట్టుకుంట యీసున్నంచిఆడివాక ఉష్షా, ఉష్షాఅనుకుంట కుంచెబెడ్తుండు. సరి చిక్కుల్లేకుంట యేపోక్కాపోగు దువ్వినట్టుగ యిచ్చుకొని గంజిఆరుకుంట పులిపచ్చిగున్నది. గంజిబెట్టిన సరికి బయ్యాన ఈగెలు ముసురుతానయి. మల్లోపారి అ దుప్పికొమ్ముకాడ తాడుమీద కాలేసి తొక్కి బిగిస్తుండు- ఇగ సరి అరుతాంది- మనిషి ఆగమాగమైతాండు- చెమటలు గార్తానయ్- మల్లమల్ల, మల్లమల్ల! ఉష్షా ఉష్షా అనుకుంట కుంచెబెడ్తాండు ఆ కొసకు ఈ కొసకు ఉరుక్కుంట వనేరుతాండు- ఇగ ఆపవి ఆపుతె సరంత మొండ్యపొయ్యి బిల్లగట్టపొయ్యి పనంత పాడయిపోతదని ఆయినె ఆపతి- గింతల ఇంట్లకెల్లి అమ్మగారువచ్చి "వారీ రాయరాం, అయ్యగారికి జిందాతిలసమాతు రాయాలాని, కొంచెం ఇటొస్తిర మల్లబోదువుగని" పిల్చింది- అమ్మగారంటె ఆగడి వాల్లదె- అమ్మగారోల్ల ఇంటెన్క దర్వాజ గడీలకున్నది- రాయరామోల్లు గడినడుమవున్న చిన్న యింట్ల వుంటరు- అమ్మగారోల్లు బిల్సిండ్రంటె ఇగ మొగులు మీదబడ్డ ఆగేదిలేదు- అమ్మగారు పిల్సేటాల్లకు రాయరాం పిచ్చిలబడ్డడు- తొక్కులాడ్తాండు- "పెద్దదన్న

వుంటె సరిజూసుకుంటడనుకుంటె లఛ్మికొడుకు యెక్కన్నొ పెయిండు- యిగెట్లన్నా" అని పత్తాయించుతాండు- "యేందమ్మగారు, నేనత్తానపారాము" తొక్కునూరుతాన బక్కమల్లమ్మ రోకలి గోడకునిలబెట్టి జెప్పున రోలుకాన్నుంచిలేచి చిప్పల చెయి గడుక్కొని కొంగుకుతుడుసుకుంట వచ్చింది- "రాయరాంగాడైతెనె మంచిగరాత్తడని అయ్యగారు పిల్తాండు- రారాదుర రాయరాం, మల్లచ్చి వస్తాసుకోరాదుర యేంముని పాయె. దా, దా!" అమ్మగారు ఇంట్లకు బోవుకుంట, తొవ్వలున్న బర్రెతలుగు కొయ్యకు జుట్టిరమ్మని చెప్పుకుంట పొయింది.

బక్కమల్లమ్మ రాయరాం భార్య, బుగులుపడ్తాంది- రాయరాంకు సరిని యిడిసి పెట్టి బోబుద్దయితలేదు- ఉచ్చితార్తంగ వనంత పాడయిపోతదని ఆరాటం, యెవ్వడు చేతికింద లేకపాయెనని కోపం, అమ్మగారుబిల్సె యిగెట్ల అని దుక్కమచ్చినట్టయింది- ఎటూతోచలేదు చేతులున్న కుంచె ఆడపారేసిండు- దబదబ అమ్మగారెనక ఉర్కినట్టుగ పొయిండు- "లేకుంటేంది మరి, వాల్లు ఆయింత యింట్లకెల్లగొడ్తె యేచెట్టుకిందికి బోతం!" అని భయం- వాల్లావుండె ఆ చిన్నయిల్లుకు కిరాయిలేదు- అయితె ఆ యింటిసుట్టు ఊరెల్ని సాకిరుంటది- ఇంట్ల బోల్లుబొచ్చలు తోముడుంటది- పొద్దుగాల రాత్తిరి నీల్లుపట్టాలె- వాల్లకు నల్లవున్నది- తానాలగదికి, పాయకాన్లకు నీల్లుబెట్లాలె- అన్నజాడీల్ల నింపాలె- ఉప్పు మిర్పకాయకు పొయిరావాలె- కాల్నొచ్చినా యేల్నొచ్చినా అర్సుకోవాలె- రాత్తిరి రాత్తిరి వడ్లుదంచాలె- యేదో పనున్నదని పక్కవూరికు పొయిరమ్మంటె పోవాలె- గందుకె కిరాయిలేదు- నాకు పనున్నదంటె కల్తద?

X X X X

"యేడికి పెయినవ్‌ర, అరేయ్ ఓర్‌లఛ్మికొడ్క- చీర్లాకేదిర,[3] చీర్లాకేదిర చీరేత్త- వీనియవ్వసీ ... పో లంజకొడ్క పో! పెండకు బొయిరాపో!" మూడోడు శేకరిగాన్ని తిడ్తాండు రాయరాం- శేకరిగానిగ్గూడ యెరికె నాయిన అవ్వయెట్ల కస్ట పడ్తాన్రనేది- పొద్దుగాల్లేత్తెనె చీపురుబట్టి అవ్వనాయిన ఇద్దరుగల్సి గంటసేపు ఊడ్తరు- మొత్తం వాకిలంత సల్లటానికి రొండుతట్టల పెండబడ్తది- అటెన్క అమ్మగారింట్ల పెద్దిల్లు ఊడ్వాలె, అల్కాలె- గాదెలున్నఅర్ర, వండుకునెఅర్ర, మల్లెసాల, తడ్లు సొటుగట్టిన చెక్కఅర్ర అన్ని ఊడ్సెటాల్లకు అయ్య నడుంటంగుమంటది- యాష్ట గుంటది- అవ్వ బండెడు బోల్లుదోమి కడిగి ఇంట్ల బోర్లిచ్చిరావాలె- మల్ల ఇంట్ల జూసుకోవాలె, గిదంత పన్నెండేండ్ల శేకరిగానికి యెరికె- నాయిన అవ్వకష్టపడ్తాండ్లని అనుకుంటడు- గండ్కనె నాయినతిట్టే తిట్లకు కాల్లుగొట్టుకుంటనె తట్టబట్టుకొని పెండకు

బోతడు– రోజు పెద్దరోడు మీదికిబోయి, బీటుతొవ్వల బండ్లునడిచే బాటల ఊరుపెట్టు బొయ్యి తట్టనింపుకత్తడు– రోజుకు రోజు నాయిన తిడ్తనేఉంటడు– పోనుపోనను కుంట తట్టబట్టుకొని పోతనేవుంటడు శేకరిగాడు.

బీటుమొకాన పెయినప్పుడల్ల బుజానికి సంచేసుకొని శేకరిగాని చిన్నన్న లచ్చిగాడు బీళ్లెకుబొయ్యి బండ్లపొంట కిందబడ్డ మెరపకాయలొ, యెర్నెగ్గెకాయలొ యేరుకొని, లేకుంటె బండ్లల్లకెల్లి పెసర్లుగిన కొట్టేసి సంచులు నింపుకచ్చేటోడు– శేకరిగానికి గిన్నెన్ని యేర్నెగ్గెకాయలు బెడితె పెండచేతుల్తోనె ఒబ్బుకుంట బుక్కుకుంట తట్టబట్టుకొని తిరిగెటోడు.

లచ్చిగానికి యేడేండ్ల పోరనప్పుడు యేదో అయిందని రాయేశుని దేవుని పేరుమీద జున్నెకిడిసిండ్లు– అట్ల దేవునిపేరుమీద వుండెటోల్లకు చెవులకు రాగిపోగులు, పెయినిండరాగి నగలు, కాలుకు రాగిబేడి వుంటయి– సౌరంచేయించరు– లచ్చిగానికి శికెముడి యెంటికెలు. రాగెంటికెలోల్లె ఎర్రిగుండి ముద్దలుగట్టుపొయ్యి నెత్తిమీదికెల్లి పెడపుట్టు తాల్లుతాల్లు యాల్లాడుతాంటయి– బట్టలుగూడ దుబ్బదుబ్బెనాయె– ఇగ వానవుతారం జూత్తెనె దయ్యంగూడ జడుసుకుంటది– గట్లుంటడు.

సంచుల్ల నింపుకచ్చుకున్నయన్ని అక్కన్నె ఓదుకాన్ల అమ్ముకొని సీన్మాలు జూపెటోడు– ఇంట్ల అవ్వనాయిన తిడ్తాంటరు– వాడుకొద్దిగ యాల్లదప్పి యెన్కనే వస్తడు– యెవ్వలు లేన్దిజూసి యేసుకోనితింటడు– అవ్వ రాట్నమీద కండెలు సుట్టుకుంట సూసుకుంట "కుక్కోల్లె కుండకెగబడి తింటాడు సూడు గాడ్దికొడుకు, ఆకూడు పెయికెట్లబడ్తాందిర, గింత గాయిదిలిగ్గుడు తిర్గుతాండు– వీనికి బుద్దెట్లత్తదో, యెవ్వడు జెప్పెటోడులేడాయె సేపెటోడులేడాయె– అన్నాలెం– గిట్లెట్లతిర్గబుద్దయితందిర నీకూ! అయ్యో! చాచాచాచా!" తిట్టుకుంట సడుతాంటది. లచ్చిగాని పెయిమీది దేవుడు చెవ్వులకు అడ్డముంటడొ యేమొ గిదేమి పట్టిచ్చుకోడువాడు– తిన్నదంతె అయిపాయె చెంగోబిల్ల.

X X X X

"రాయమల్ల, కన బిర్రిబెట్టినెయ్యర– గది చటాకువజను తక్కువున్నాగని సాహుకారి బీన వన్నీన సూసుకోని యేసుకుంటడు– యెన్ని ఇకమతులబడ్డ సావుకారి ముల్లే నిండుతలేదాయె" అన్నడు పెద్దకొడుకుతోని రాయరాం.

"సీకేంది అనంగనెబపాయె– బుడ్డసన్నులునేసినట్టా? పల్లికట్టె[4] దీసి పల్కేసెటాల్లకు కద్పులపేగులు నొప్లెకత్తానయ్– బిర్రిబెట్టంగనె కావద్ద– వనితొక్కెనిక్క–

కాల్లుకీల్లు గుంజుకత్తానయ్- వనిదెర్వక నాదెసొర్కిక జారి మోకాళ్ళమీదపడి పొక్కులు బొడ్తాంది. యేదీ, ఆ సావుకారిగాన్నివచ్చి రొండుకండెలు నేసిపొమ్మను తెల్తది- రొండువాల్లేసి రొండుపొర్ల పల్కగొట్టెటాల్లకు అయ్యగారి జబ్బలు జమిడికెలేస్తయి- గప్పుడుదెల్తది, కూలోనిసంగతి జంపుకాల్లసంగతి" అని అనుకుంటనె తాడుబిగిచ్చిండు. పెద్దోలకాడ తాడు కిర్రుమన్నది. దుబుక్ దుబుక్ మన్నదెబ్బ ఖటక్ ఖటక్ మని తాకుతాంది. పండ్లుబిగబట్టి వఃదొక్క వంగి ఈపక్కనుంచి నాడేసి జనిగెత్తిర్గసాగి ఆపక్క నాడె అందుకొని సట్టరుగొట్టెటాల్లకు కండ్లల్ల నెత్తురువరాలు తేల్తానయి. దోస[5] డొక్కల సొచ్చింది. 6 నెంబరునూలు ఒంటిపోగునేత ఎంతకు యెద్దది- కొట్టికొట్టి నడుం టింగ్ మంటంది.

"ఇంతజేత్తె అడసేటు- ఇది దీలగున్నదంటడు- వజన్ తక్కువున్నదంటడు. సరిదేలిందంటడు- గిది గిట్లున్నది, గది గట్లున్నది అని వంకలుపెడ్తడు- పట్టుబడికాడ కూలికాడ కోశీసుజేత్తడు- ఊరుకంటె సనుక్కు పావుల తక్కువిత్తనంటడు- ఇంకో కాడికి బోదామంటె జమానతుగావాలె- "మాలు నీకెవడు నమ్మిత్తడాత్రి!" అంటరు- ఇంత బజాట్ల పతారబుట్టిచ్చుకుంటె ఇంట్ల నేపెదిక్కులేదాయె-" అనుకుంటాంటడు రాయరాం- ఎన్నడు సక్కగ నెయ్యడు రాయమల్లు- "నేత్తేంలాబమున్నది, తిన్న దగ్గవోడునెయ్యాలె" అనెటోడు- ఇగ లచ్చిగాడు ఇప్పుడిప్పుడె మొగ్గంనేస్తండు- గని ఆ పెయిమీది దేవనిరూపం ఇసుకుబుట్టిచ్చేది- చిరాకుపడేటోడు- లేసిఅవుతలబడెటోడు.

X X X X

అంబటాల్లకు మొకంకడుగుతాన బక్కమల్లమ్మ యింటెనక మక్కపెరడు "తన చేతుల్తో ఇత్తులేసి, పెరడుకలుపుతీసి పాదులుమెత్తి పొతంజేత్తె ఒక్కకంకి యిరుసుకునె ధైర్నంలేదాయె- ఏంబాగ్గెం" మన్నులగునుస్తంది- మక్కపెరడు సుంచులు బెడ్తాందని సూత్తాంది (గది అమ్మగారోల్లది) గింతల "రాయమల్లడు బువ్వ కచ్చిండె" అన్నడు రాయరాం మొగ్గంమలగట్టుకొని ఎర్రిమన్నుతోని అచ్చన[6]బెట్టుకుంట- దబదబ గిన్నన్ని నీల్లుపుక్కిలిచ్చి ఊంచి చెయికుడుసుకుంట వచ్చింది బక్కమల్లవ్వ- అందరు ఎట్నో తింటరుగని పెద్దోడంటె మల్లవ్వకు బయం- తలె మల్లమల్ల కడిగిపెడ్తది- ఇంట్ల ఎక్కడ తలెపొందది- అన్నీ గుంటలే- ఇంట్ల ఎవ్వలకన్న దగ్గు పడిశెం జెరం యేదన్నగాని రాయరాం యిసురాయితోని ఇంట్ల "వల్లు"బడ్తడు- "దేవుడా నీబాంచెను, నీ మాయుంటె గట్టిగ బట్కవాలె లేకుంటె పువ్వోలె లేవాలె" అనుకుంట విలబెట్టిన యిసురాయిని లేబట్టుకుంట ఎత్తేస్తాంటడు- అవ్వే గీ గుంటలు.

రాయమల్లు దర్వాజలకెల్లి కొద్దిగతల్లాయెవంచి లోపటికొచ్చి అడ కాల్లమీద కూసున్నడు- బక్కమల్లవ్వ తలెలబువ్వేసుకుంట "లచ్చిగాడు దేవునిపేరు మీద గట్లదిగ్గవట్టె- చెరొక్క గుడ్డవేసినా అయ్యకింత ఆసరగాదుర- ఒక్కడు ఎన్నిదక్కుల పాతులాడ్తడు- మలేసుకుంటె కుంటెబెట్టె దిక్కులేదాయె- ఇగమీరు కొడుకులు వుండెందుకు లేకెందుకురా- అన్నాలం ఒక్క వాటెయ్యకుంట తెల్లార్లెత్తెనెమొగ్గం జాప్తిరి పోతిరి- ఎట్లరగిట్లయితె అః" కూరేసి మంచినీల్లుబెట్టి ఆకుండిటు ఈ కించు దటు సదురుకుంట, ఓపారి పొయ్యికాడికిబోయి కొర్కాసులమీద నీల్లుజల్లి అటిటు దిరుక్కుంట జెప్తంది. రాయమల్లు తింటనేవున్నడు- కుఁయ్‌లేదు కఁయ్‌లేదు. రొండు నిమిషాల్ల తిన్నడు దోత్తోని మూతితుడుసుకుంట పోనేపోయిండు.

"తోడేలుమీదబడ్డట్టు ఇంట్లసొచ్చి తిన్నడు పోతండు- గిట్లున్నదిపిల్లకత" కదురుమెకొనసూసుకుంట కండెపోసుకుంట అనుకుంటాంది. ఎర్రికండెలు గావాల్నని రాయరాం పిలువంగనె "అరె శేకరిగ గీ కండెలు నాయినకియ్యిబిడ్డ"అని బడికి పొయ్యొస్తాన శేకరిగానికి ఇచ్చింది. "అరెయ్ అప్పొగిన్నన్ని ఊకె లేర్కరాబిడ్డ" అన్నది. వాడు సంకలవయిలు రాట్నంకాడబెట్టి కండెలు అయ్యకిచ్చి "నాకెర్కలెపో నేంబోవాలె, సార్జెప్పినదమ్మన్నడు- బువ్వెయ్యి"అని గార్వంగ అక్కడి గుంజ కొయ్యను కొట్టుకుంటఅన్నడు- "ఇగ వాల్లుజేసిందుర్రి నువుజేత్తవనిఅశార, గిన్నన్ని ఊకెలేర్లరారకుంటె అబ్బ పిల్కకెరెత్తం సల్లగుండ ఒక్కడు ఒక్కసార్గం ఇంటెన అన్నలు గింతశెవునబెడ్తలేరు" అనుకుంట రాట్నంమీదికెల్లి లేచింది బక్కమల్లమ్మ.

దర్వాజలకెల్లి అమ్మగారు పిల్చింది "బక్కమల్లూ, కసింత గిటురాయె, మా యింట్ల ఇయ్యాల పెర్గుతోడ్కలేదె- అబ్బాయి జనయ్య బడినుంచి వచ్చిండు- కొంచెం పెరుగు తెచ్చిపెట్టాల్నె- జెప్పిన బోదువుగని ఒక్క నిముషం ఇటురాయె" సగం తెరిసిన దర్వాజలకెల్లి గింతంతమొకం ఇవతలికిబెట్టిపిలిచి లోపలికిబోయింది అమ్మగారు "నాకు జెప్పిన బువ్వెయ్యే నేంబోవాలె" కాల్లుకొడ్తాండు శేకరిగాడు- "అగరాదుర నువ్వొనివి- అవుతల అమ్మగారు బిల్తాంది" అనుకుంటపోయింది.

శేకరిగాని చిన్న మనుసుల యెందుకో అమ్మగారంటె కోవంవుంటది. ఎప్పుడు జూసినా అన్ని వాల్లపనులె- గారాత్రి గుడ్డిదీపంకాడ గింత సదువుకుందామనెటాల్లకె, "వారీ శేకరీ, బర్రెకు తవుడెయ్యాల్రా, ఒక్క నిమిషం ఇటచ్చిపోర" అని పిల్తది. ఆమె పెద్ద గుండుచెంబెడు పాలుబిండెటాల్లకు ఇంకోలింకోలయితె మూడుసోల్లతవు దొడ్తది- గదె శేకరిగాడేత్తె బర్రెమూతి ఆగకుంట బుక్కలకు బుక్కలు మింగకుంట

బర్రెపెయూతికాడి గిన్నెల చిన్న పిరికిడితోటి పిరికిడి పిరికిడి తవుడుయేత్తడు- ఒక్కనోడు తవుడుపాల్తది పీదేత్తె. అందక్కనె అవ్వగాను ఎప్పటికి పీన్నేబిల్తది- తెల్లార్లేవంగనె బర్రెను మందకుగొట్కపోవాలె- చీకటిబడంగ రాంగనె బర్రెను గుంజకుతలుగుతోని కట్టెయ్యాలె- వాస్రా కింద గడ్డివుంటది, అదింతతెచ్చెయ్యాలె- గిట్ల చానపనులు జెప్తది- ఎప్పుడన్న శేకరిగాడు మూతిటు ముక్కటుబెడ్తె యేంటిబో వడియందెచ్చిచ్చేది. వాడు గదియ్యంగనె చాటంతమొకంజేసుకొని ఇగిలిచ్చేటోడు.

* * * * *

జంపుకాన్లునేసే కూలీలకు దుకాన్దార్లు నూరు ఇన్నూరుసనుగులు పట్టుబడి జెప్పితరు. మొత్తం నూరుసనుగులకు 20 పెట్టెల మాలుపడ్తది. కాని దుకానాలసేట్లు "18 పెట్టెలేయిస్తం, గండ్లనెచెయ్యాలె" అంటరు "గండ్లెట్లెల్లయి బాంచెను, మాకుఅండ్ల ఏమి ఒక్కనూలుపోగువుండది. మీరుగిండ్ల కోశీసుజేత్తె మేం యెట్లనెయ్యాలె చెప్పుండ్రి. అంతలావైతె మా కూలిల తక్కువజెయ్యండ్లి" అని నూరుసనుగులకు మున్నూరురూపాయిలు నికరమయిన కూలిని తమకుతామే తగ్గించుకుంటరుకూలీలు. మాలుతెచ్చుకుంటరు- నేసిస్తరు- ఎన్నిసనుగులు నేసిఅప్పజెప్తె అన్నిసనుగుల కూలి పైసలు మాత్రమే ఇస్తడుసేటు.

వానకాలం, సలికాలంల గిరాకియెక్కువ- అందుకని ఎండకాలంల సరుకు తయారుచేయించుకొని నిలువజేస్తరు. ఏరోజుకారోజు సాయింత్రం దుకానంసేట్లు గుమస్తాలను ఇండ్లల్లకుబంపిచ్చి సనుగులు తెప్పిచ్చుకుంటరు- లేకుంటె తాగుబోతు కూలిగాండ్లు సనుగులు ఇంకొకరికి అమ్ముకబొబ్బుతరనిభయం. పట్టుబడి జెప్పిన ఇల్లిల్లుతిరిగి "సేటు సనుగులుతెమ్మంటాండు" అనిచెప్పి జరూరతుమీద దుకాన్లలేని సనుగులు జమజేస్కత్తడు గుమస్తా- ఇట్లపొయినప్పుడు ఆ గుమస్తా సేటుదగ్గర తిన్న తిట్లన్ని నెమరేసుకొని, ఇక్కడ కూశోల్లమీద తాను ఒకసేటులెక్క అవ్వేమాటలు రుబాబుగ మాట్లాడి నాకేందక్కువ అనుకుంటడు- ఆడీడనూడేసిన సనుగులు ఆరోజు నేసియ్యని కూలోన్నిబట్టి "ఇయ్యాల నువ్వు ఒక్కసన్గన్న ఇత్తలేవు- నాకెర్కలె- సేటుదగ్గరికి నువ్వేవచ్చిచెప్పుకో- నేంబోతాన- ఇగో వచ్చేటప్పుడు గీ సనుగులు గూడ తేవాలె- ఎర్కెనా- నేనైతెబోతాన" అని అంటగట్టి పోతడు.

ఆనాడు రాయరాం పర్దలుకు జెరమచ్చిందంటె చూసిరానుపెయిండు- నేసుడు కాలేదు ఇయ్యాల రాయరాం నెత్తిలబడ్డయి జంపుకాన్లు.

మూడోడు శేకరిగాన్ని ఎంబడేసుకొని మొత్తం 40 సనుగులను రాయరాం 25, శేకరిగాడు 15 తాల్లతోని గట్టిగ కట్టగట్టుకొని నెత్తినెత్తుకొని బజారు[illegible]ద్దరు. నడు

స్పాంటె శేకరిగాని నెక్కరుజేబులున్న దోసెడుగోలీలు గల్లర గల్లర సప్పుడయితానయి ఆ గోలీల వజనుకు నెక్కరు వంకరదిరుగుతాంది. ఒకచేత్తోటి నెత్తిలమూట పట్టుకొని ఎగిరినట్టుగ ఎగేసుకుంట ఇంకో చేత్తోటి నెక్కరుపక్కగ లిప్పుకుంటాండు. నెత్తిలున్నమూట ఎత్తేసినట్టు ఎగిరిపడ్తంది. మూటకుగట్టినతాడు నెత్తికిబిత్తుకపొయ్యి నొప్పిబెడ్తంది. "అన్న-అన్న" అంటాండు నొప్పికి- ఊకె లాగుసవరిచ్చుకుంట మూటసవరిచ్చుకుంట నెత్తిలమంటకు "ఉస్"అని లోపలికి పీల్చుకుంట నడుస్తండు శేకరిగాడు. "ఏందారి, ఆటూఇటూ ఎగురుడెందుకురా, ఊకె పక్కగనడ్వలేవ్"అని శేకరిగానిదిక్కు చూసుకుంట నడుసుకుంట అన్నడు రాయరాం నడిజాల్ల బొందలున్నయి. చూసేసడ్తాండు- బొందలున్న పండిలేసి కాల్లల్ల మెదిలింది- నెత్తిన మూటెత్తుకున్న రాయిరాం తత్తరపడ్డడు, బోర్లాపడ్డడు. మూట బురద గుంటల పడ్డది- "అయ్యయ్యయ్యో! సస్గులన్నిపాడాయె- బంగారమసొంటి గుడ్డలు- చా చా చా చా!" అనుకుంటలేసి బట్టలన్న దులుపుకోకుంటనే సనుగులదగ్గరికి పోవుకుంట "పక్కగనడ్వర అంటెకొడ్తాఅంటె వీడు సకమొకాలునడ్తాండె"అని శేకరిగాని వీపుమీద వాటమైన పరుపుసరిసిండు. వాడు అంతదెబ్బతిన్నా యేడుపలేదు- జరిగిందానికి దిక్కుమొకంబెట్టి "నేనేంజేసిన"అన్నడు- రాయరాం బుర్దలబడ్డ సనుగులమూట లేబట్టి ఆ పక్కన ఒక అరుగుమీదబెట్టి అన్ని ఒక్కొక్కటి దోత్తోటి తుడుసుకుంట, నడుమ నడుమ "అయ్యయ్యో చాచాచాచా" అనుకుంట మల్ల జమాయించి కట్టిండు.

దుకాన్ల సేటు యేమంటడో యేమొ అని గుబుక్కుంట పెయిండ్లు. దుకాండ్ల సేటు మంగటదించిండ్లు- సేటు ఎవల్తోనో మాట్లాడ్తాండు. యెన్నిలోగె తెల్లగ లైట్లు యెల్గుతానయ్. మూటదించి పక్కపొంట దొడ్డికాల్లమీద కూసోని రెండు చేతులు పప్పతి బట్టుకున్నట్టుగ పెట్టి మొకం డీలపడి సేటు ఇటుమొకాన ఎప్పుడు జూస్తడో అని మిటమిట జూత్తండు రాయరాం. శేకరిగాడు కాల్లయేల్లమీద నిలేసిన మడిమెల మీద కూసోని మూట మీద చేతులేసి మూట తాల్లను సవరిచ్చుకుంట- అక్కడక్కడ మీదికెల్లిన పోగులను వడి తాల్చుకుంట కూకున్నడు.

"ఆఁ ఏమిటండీ రాయరాంగారు ఇలా దయచేశారు- సంగాలు బెట్టినవ్రీ; సాపుకార్ల సంగతి జూసరటగద- ఆఁ ఊరేగింపులు బహిరంగసభలు అబ్బో! మీకేంది యెయ్యో- యేదో ఓ కంట సూడుండ్రి మమ్ముల" సేటు రాయరాంతోని ఎకసెక్కెలాడ్తాండు. ఆరోజు ఊరేగింపు ఉన్నదని కరపత్రిం యెల్లింది- దేశంల ఉన్న అందరితోనిపాటు నేత కూలీలయి గూడ రెండు ముచ్చట్లు రాసిండ్లు అండ్ల. గందుకె సేటు క్యారెడ్డాలాడ్తాండు.

"నాకేం దెల్వది బాంచెను- ఇయ్యాల పనిగాలేదు మన్నుగాలేదు- శని నెత్తిల గూసున్నట్టయింది- దండంబెడ్తనయ్య."

"ఎట్లయితదిర, సంగాలాయె మీటింగులాయె- పనెట్లయితదిర- మీకు గండ్లనె బతుకుదెరువున్నదిర- పొండ్లి- యెవడెక్కడ వోతె మాకేందిర మా మాలు మాకు ముడితె అయిపాయె."

"గట్లెట్లయితది బాంచెను- పొద్దుగాల లేత్తెనె మొగ్గాలసొచ్చి వాలెన్కవాటు యేతెనె యెల్లడు తిప్పులాయె. మాకు మీటింగులేమెరుక- రేపట్నుంచి కాడ పోకుంట నేశిత్త బాంచెను- ఇగో జంపుకాన్లు దీస్కోవిరి."

సేటు జంపుకాన్ల కట్టమొకాన సూసిండు. అంత బురద మరకలు- గలీజు గున్నయి- నోరుదెరిసి సూత్తాండు.

"వత్తాంలె తొవ్వల" ఇంక రాయరాం ముచ్చట పురాగ చెప్పకముందె-

"ఏందిరి, అరెయ్- ఇవ్వి జంపుకాన్లా ముట్టు బట్టర్లా.... ఇవ్వి యెవ్వడన్న యే తల్కామెలేని లంజకొడ్కన్న కొంటాడరి.... నీ మొకానికి యాల్లకు సగ్గులెన్నెయ్యవ్, తీస్కరార అంటె బుర్దలేస్కత్తవ్- బాగ సుకమచ్చిందిర మీకు- బంచోత్ బాడ్కావులకు కొవ్వుపెరిగిందిరమీకు- పో తీస్కపో లంజకొడక గ బురదలేసిన జంపుకాన్లు మాకెందుకురా- లే, నడువ్- నీయవ్వనీ...." యెట్లబడ్తెఅట్ల తిడ్తాండు సేటు. శేకరిగాడు యింటాండు- వానికేమైతాందొ వానికేతెల్తలేదు. మూటగట్టిన తాడును యినుకుంట చెయితోని బిగిత్తాండు, బిగలాగుతాండు. గుంజీగుంజీయిడిసిండు. "డుబుక్కు"మన్న సప్పుడయింది. సేటుఒక్కపారే యిటుజూసిండు. పోరడు లోపల్లోపల్నే పండ్లుకొరుకుతండు. "లేదుబాంచెను- నేను మంచిగనేవత్తాన, పంది పాడుగాను కాల్లల్లమెలిగింది. నేంబడిపెయిన- ఇగజూడుబాంచెను మోకాల్లు" చూపెట్టిండు- అసలు రాయరాంగూడ గప్పుడే చూసుకున్నడు నెత్తురెల్తంది- దోతికంత నెత్తురు మర్కలయినయి. మోచేతులకు రాక్కపొయింది. అయినా గివన్ని లెక్కబెట్టకుంటనె బతిలాడుకుంటాండు.

"వారీ రాయరాం, నాకు గివన్ని జెప్పకు- ఇంకోలింకోలైతె యిర్గదన్నిత్తును- నువ్వు పెద్దమనిషివి- వాడుపోరగాడు- నేనైతె కోపంమీదున్న- ఏంజెయ్యాల్నొ ఎట్లుంటదో నువ్వేసూడు."

"నిజమే బాంచెను, తప్పయింది- ముసలిముండకొడుకును సెమించాలె బాంచెను- నన్నేంజెయ్యమంటె అదేజేత్త- గవి గీసనుగులు తీస్కోండ్రి- దండం బెడ్త- కాల్మొక్కలుడిగినోన్ని, దయజూపుండ్లి- మీరెట్లంటె అట్లనె- దేవుఁసోంటోల్లు- మమ్ముల జెర సెమించాలె బాంచెను" ఇగ ఒకటె మొక్కుడు మొక్కుతాండు, కాల్లుఁబట్టుకో బోతాండు. భూమికి చేతులుఆనిచ్చి మొక్కుతాండు.

ఇట్ల కొంతసేపయినంక సేటుకొద్దిగ మెత్తబడ్డడు- "అరెయ్. లె! నీయవ్వ నీ ముసలోన్న....ల్లె!- అన్నిమొత్తం యెన్నిసన్గులార్రి!" కిందికిమీదికి అటుయిటు చూస్తుంట అడిగిండుసేటు.

"40 బాంచెన్" యేడ్పుస్వరంతో.

"అయితె 40కి (నాల్గుమూళ్ళ పన్నెండు అని లోపట్లోపల గునించుకొని) 120 రూపాయిలు కోస్తోని తీసుకుంట లేదంటవు నువ్వేతీస్కపోలె- ఇక్కడ లొల్లిపెట్టద్దు- ఊఁ లే!"

"ఓసేటో, నీకాల్మొక్త- దండబెడ్త అవ్వెనాయిగూడగావు మొస్కచ్చినందుకు మీదేత్తాండ్లు- గింతఅన్నాలెంజెయకుండ్రి- పొల్లగాండ్లు కూటికిసత్తాండ్లు- సేటూ నీ బాంచెను, నీపియిదింట-" బావురుమంట యేడ్తాండురాయరాం- కోతిమాదిరిగ కిందికి మీదికి దండాలుబెడ్తాండు. సేటు అరుగుమీది పరుపుమీదనె అటుయిటు తిరుగుతాండు- అయినె కాల్లుబట్టుకోబోయి మల్లోపారిపడ్డడు రాయరాం. శేకరిగానికి అయ్యను జూత్తాంటె గుడ్లల్లనీల్లు గుబగుబదున్కుతానయి- అయ్య పడంగనె వాడునటుక్కు లేచి నిలబడ్డడు సుట్టు అంతకలియజూత్తాండు.

ఈలొల్లికి ఇంకో పక్కదుకానంసేటువచ్చి, "ఏదోపాపం పోనియ్యరాదు- 15 సనుగులైతె మంచిగనె వున్నయిగద- ఇగ ఆ 25కి 75 రూపాయిలుకోసుకో- పోనీపాపం ముసలోడు యేడ్తాండు- లేర ముసలోడా- యేంపనాఁయిది ఆఁ! లెలే!" మధ్యవర్తితీర్పు జెప్పిండు.

"అయ్యా, గిదిఅన్యాలం, అన్యాలం "ముసలికన్నులకింద బొక్కలెల్లిన బుగ్గల గుంటలనుంచి కన్నీల్లు జారిపోతానయి.

"అగొ ఇన్నావయ్యా, పీనికాపురం- యేదొ నువ్వుజెప్పినవుగద అని ఇంటా మనుకున్న- కని వానిమాటవాడే"సేటు.

"లేవే రాయరాంవన్న సేటుజెప్పితె ఇనాలె- కాదంటెమరినడ్తద- ఎట్లనో అయింది. తప్పుదండుగ" ఇంకోకూలన్న లేబట్టిండు.

చిన్నపోరనిలెక్క యేడ్చుకుంట కొడుకునుతీస్కోని దుకాండ్లకెల్లి బయటి కచ్చిండు.

బజార్లకొచ్చేటాల్లకు దూరంనుంచి మంటలు కదిలివస్తున్నట్టుగ కన్పిచ్చినయ్. కండ్లు తుడుసుకుంట చిత్రంగ చూస్తుండు రాయరాం. ఆ మంటలు ఇటుదిక్కేవస్తున్నాయ్ ఆడనే నిలబడ్డడు. అది కాగడాల ఊరేగింపు- ముందట పెద్ద బంగ్లంతయెత్తున రెపరెపలాడుతూ పెద్దజెండ- లైట్ల యెలుగుల రెపరెపమెరుపులు మంటల్లాగనె వున్నయి. ఆ జెండకింద ప్రతొక్కలచేతిల మంటలు- ఆ మందిల గుడ్రింగనిలబడ్డోల్లు పాటలుపాడ్తాండ్లు.

పాటయింటాంటె రోమాలు గొగ్గరిస్తానయ్- రాయరాం పాలిపోయినమొకం తేరుకున్నట్టుగయితాంది బక్కదవుడల్లకెల్లి పండ్లుకొరుకుతానట్టుగ తెలుస్తుంది. ఊరేగింపు బహిరంగసభకు పోతాంది అందరిచేతుల ఉన్నట్టుగ రాయరాంచేతిల దివిటీలేదు. చేతబట్టుకున్న కొడుకే దివిటీగ ఊరేగింపులో కలిసిండు.

ఈ కథలోవచ్చిన వృత్తిపదాలకు అర్థాలు-

1. అంపలి: కంచాలు బోల్లు కడుగుకొనడానికి నిర్దేశించినస్థలం.
2 లాకబద్ద: కొంచెంవెడల్పుగా ఉండునట్లుగా చీరిన వెదురుబద్ద.
3. చీర్లాక: సన్నగాచీరిన వెదురుబద్ద.
4 పల్లికట్టె: దోస్గకు అడ్డంనిలువులలోవున్న రంధ్రాల్లోదూర్చి దోస్గనుబిగి బిగించడానికి ఉపయోగించే కర్ర.
5. దోస్గ: నాలుగు పలుకలుగావుండి వేసిన జంపుకానను చుట్టేసుకునేది.
6. అచ్చన: జంపుకాన పొడవును మించిపోకుండా వుండేందుకు పెట్టేగుర్తు.
7. ఊశె: కండెలు చుట్టడానికి రేకుతో మలిచిన గొట్టం.